# నిప్పుతో చెలగాటం

పట్టణంలో కాపురం పెట్టాడు కొత్తగా పెళ్లైన శ్రీనివాసరావు వో చౌకబారు అద్దె కొంపలో.

అయితే ఏం ? అలవాటు ప్రకారం అలారం లేకుండానే అయిదు గంటలకల్లా టంచన్‌గా నిద్ర లేస్తుంది18 ఏళ్ల చంద్రిక. లేవగానే మంగళ సూత్రాలను కళ్లకద్దుకుని ఇంకా నిద్రలేవని భర్త పాదాలను లాంఛనంగా తాకుతూ చెంగుమంటూ మంచం దిగి, అవసరాలను తీర్చుకుని స్నానం చేసి, వంట ఇంట్లో జొరబడుతుంది.

ఏ అలుపూ, సొలుపూ లేకండా క్షణాల్లో వంటపనీ, ఇంటిపనీ ముగించుకుని శ్రీనివాసరావ్ లేచేవరకు పొగలు కక్కుతూన్న కాఫీ కప్పు చేతిలో పట్టుకుని సాలభంజికలా నిలబడుతుంది. తరువాత కొసరి కొసరి అమ్మలా వడ్డిస్తూంది. అట్లా పుట్టింట్లో అమ్మ నేర్పిన పతిభక్తి పాఠాల్లో ఏ పొల్లూ పోకండా చంద్రిక, శ్రీనివాసరావుకు సకలసపర్యలు చేస్తుంది. పల్లెటూరి పలట్ పాపం!.

ప్రతినిత్యం భర్త కడప దాటే వేళకు అన్నీ సవరించుకుని ముఖాన కాంతి చుక్కల్లా మెరుస్తూన్న చెమట బిందువులపై తుమ్మెదల్లా వాలుతూన్న ముంగురులను వో చేత్తో పైకి తోసుకుంటూ, బుంగమూతి పెట్టి సిగ్గులొలుకుతూ వొయ్యారంగా 'మళ్లా ఎప్పుడొస్తారు? తొందరగా రండి, నాకేం తోచదు సుమా!' అంటూ భర్త కాలికి సంకెళ్లు వేస్తుంది.

పాపం శ్రీనివాసరావు అర్భకుడిలా మారిపోయి పొగరు చేపల్లాంటి ఆ రెండు కళ్ల కప్పే మాయా వాగురంలో తగులుకోకండా విశ్వప్రయత్నం చేస్తూ, విధి నిర్వహణను గుర్తు చేసకుంటూ, ఇల్లు జాగ్రత్తగా గడియ వేసుకో'' అంటూ వెళ్లిపోవడం రెండు నెలల నుండి పరిపాటిగా మారింది. కొత్త మోజు కదా మరి!

గువ్వల జంటలా ఈ కొత్త మురిపెం కాపురముంటున్న వాడ సంసారి కొంపలుండే వాడకాదు; అదేదో డేంజర్‌లైట్ ఏరియాకు ఆనుకుని వున్న పాత కొంపల సముదాయం,

అయినా, మరో సదుపాయం లేక ఆపద్ధర్మంగా వచ్చి చేరాడే తప్ప ఏనాడూ శ్రీనివాసరావ్ తృప్తిగా లేడు. భార్యకు తెలియనీయకుండా యింట్లో చేరిన మరునాటి నుండే మరో అద్దె కొంప కోసం వెదుకుతూనే వున్నాడు. పట్టణవాసాల్లో దేన్నైనా సులభంగా సంపాదించవచ్చు గానీ, అద్దె యిల్లు మాత్రం దొరకడం కష్టం. 'ఏమైతేనేం ఇంతకు రెట్టింపు అద్దైనా యిచ్చి మరో మంచి చోటికి మారాలి' అంటూ నిశ్చయించుకుని, ఇంటికి అడ్వాన్సు ఇచ్చే వస్తానంటూ గట్టి ప్రయత్నంతో వెళ్లాడు.

శ్రీనివాసరావు అవతలికి వెళ్లగానే చంద్రికకు చేసే పనేమీ కనిపించలేదు. లేని పని కల్పించుకున్నట్లు తలైనా దువ్వుకుంటానని గబాగబా లోపలికి వెళ్లి తల దువ్వుకుని, చేరడేసి కళ్లకు అందంగా కాటుకలు తీర్చి నుదుట తిలకం పెట్టుకుని అద్దంలో చూసుకుని మురిసిపోతూ ' ఆయన వచ్చే వరకు ఈ ముంగురులు మళ్లా చెదిరి కళ్లమీదికొస్తాయి; ఏం చేయను? అయినా, నాకు వేరే పనేముంది? మరోసారి సొగసుగా అలంకరించుకుంటాను' అంటూ తనలో తానే నవ్వుకుంది.

ఉన్నట్టుండి చంద్రిక మనస్సులో ఈ పట్టణ వాసపు స్త్రీలు ఎంతో నాగరికంగా వుంటారని విన్నాను. వారెలా? ఎంత అందంగా అలంకరించుకుంటారో? ఎలా ప్రవర్తిస్తారో? ఇన్నాళ్లైనా బయటి ప్రపంచాన్ని చూడలేదు. ఒక్కసారి మూసిన ఆ వైపు కిటికీ తలుపులు తీసి చూస్తే తప్పేముంది? వారి నాజూకులూ నాణ్యతలు చూచి నేనూ నేర్చుకుని ఝూ వారికి ఆశ్చర్యాన్ని కలిగిస్తాను' అంటూ కిటికీ తలుపులు తెరచుకుని ఎదురుగా వున్న ఇండ్ల వైపు చూట్టం ప్రారంభించింది.

సూటిగా నరకలోకపు తలుపులు తెరచుకున్నాయి. చూస్తున్న కొద్దీ ఏదో వింత లోకం చూస్తున్నట్లు తమాషాగా వుంది. ఇంకా చూడాలనిపించింది చూస్తూనే వుంది.

ఈ కొత్తలోకపు చిత్రసందర్శనం చంద్రిక వొంటరి తనాన్ని తొలగించింది. ఇన్నాళ్లలా భర్త ఎప్పుడొస్తాడన్న తహతహ కనిపించడంలేదు. అద్దె యింటి వేటలో శ్రీనివాసరావూ ఈ మార్పు గమనించలేదు. ఎవరి పనుల్లో వారు నిమగ్నమై వున్నారు. వోవారం గడిచింది.

ఆవాడలో వింత వింత వస్తువులు అమ్ముతారు. పంజరాలు, చిలకలు, కిళ్లీలు, పువ్వుల చెండ్లు, రాత్రింబగళ్లు భేదం లేకుండా అమ్ముతుంటారు. ప్రతి యింట్లో స్త్రీలే అధిక సంఖ్యలో కనిపిస్తుంటారు. వయసులో వున్న ఆడపిల్లలంతా ముఖానికి ఏదో రంగులద్దుకుని, ఆడపిల్లలకు తగని రీతిలో ఎదపై కొంగులు తీసి తిరుగుతున్నారు. ఇదేం నాగరికత? పట్టణాలల్లో స్త్రీలు బాగా చదువుకుని పై మెట్టులో వుంటున్నారంటారే? ఇదేం విచ్చలవిడితనం? ఛీ! ఛీ! అంటూ కిటికీ తలుపులు మూసుకుంది. అయినా మనస్సు ఆ వైపునుండి వినవచ్చే పాటవైపు లాగింది. హిందీలో మంచి పాట వస్తూంది. అర్థం తెలియకపోయినా ఆ రిథం తనను కదిలించింది. ఇంతకింతకు ఆ పాట తనను కుంభీపాక నరకంలోకి లాగడానికి సర్వసన్నాహాలు చేస్తూ ఉంది. చేసింది.

తనకు తెలియకుండానే తన చేతులు మూసిన కిటికీ తలుపులు తెరిచాయి. శ్రీనివాసరావు తనకు పూలు తెస్తాడు. కానీ ఈ చెంకీలీపాన్ తేడు. లేదు. 'నేను ఈ రోజు రెండు కొంటాను' అంటూ సరాసరి మెట్లు దిగివచ్చి పై నిండా కొంగు సవరించుకుని పాన్‌వాడితో బేరమాడి రెండు కొన్నది. పాపం వాడు జంకుతూ భయం భయంగానే రెండు బీడాలందించాడు. ఈ సమయంలో తానేదో తెలియని లోకాలను జయిస్తూన్నట్లు గొప్పగా ఫీలౌతూ చుట్టూ తేరిపార చూచింది. తనకు తెలియని వింత దృశ్యం.

విచ్చలవిడిగా మగవాళ్లు గుమ్మాలెక్కుతున్నారు. దిగుతున్నారు, అందరి నోర్లూ ఎర్రగా వున్నాయి. కొందరి మెళ్లో చేతి మణికట్టులకు పూలమాలలు చుట్టి వున్నాయి. కొందరు ఎర్రదస్తీలు మెడకు కట్టుకున్నారు. మధ్యవర్తులేదో గుసగుసలు చెబుతున్నారు. స్త్రీలంతా పగలబడి నవ్వుతున్నారు. ఆ వెకిలి చేష్టలు తనకు అసహ్యం అనిపించలేదు; ఏదో? హాస్యనటులను చూచి నవ్వుతున్నట్లుగా తనకూ నవ్వాలనిపించింది. చిన్నగా నవ్వుకుంది. కొత్తగాలి ! తాను పెళ్లి కాకముందు పల్లెటూళ్లో పుంగిళ్ళు పూసేది, చెమ్మచెక్క ఆడేది, కోలాటం వేసేది; ఉయ్యాలలూగేది, ఈ మూడు నెలలనుండి మంచి గాలి కూడా తాను పీల్చడం లేదు; ఇన్నాళ్ల బట్టి ఆ కిటికీ తలుపులు మూసేసి బావిలో పడ్డ కప్పలా బిక్కుబిక్కుమనుకుంటూ ఏ ఉల్లాసం లేకుండా ఉండేదాన్ని, ఆ కిటికీ తెరిస్తే ఎన్నెన్ని తమాషాలు, ఎన్ని రంగులు ఎన్నివింతలు చూస్తున్నాను, అంటూ తన దృష్టిని వోమారు మరో వైపు తిప్పి చూచింది.

అక్కడ వో నలుగురు పడుచుపిల్లలు అర్ధనగ్నంగా అలంకరించుకుని ఆ దారిన పోయే మగవారిని రమ్మంటూ సైగలు చేస్తూ, విజిల్స్ వేస్తూ నవ్వుతున్నారు. ఆ పిలుపుకు ఒకరో ఇద్దరో మగవారు పైకి వెళ్లారు. అది చూచిన చంద్రికకు ఏదో మోహినీ విద్యలా అనిపించింది; లేకపోతే ? అంతంత మగవాళ్లేమీ? వీళ్లు పిలిచిందే తడవుగా వెళ్లడమేమిటి? అరే! చిత్రంగా వుందే? అంటూ, పైకే అనేసింది.

మా వూళ్లో అయితే పాలేరును తప్ప ఎంత పని వున్నా ఇతర మనిషిని పిలవడానికి వీలులేదు. వాడైనా ఏ పావలో? పరకో చేతిలో పెడితే గాని కోమటింటికి వెళ్లి మనం చెప్పిన సరుకులు పట్టుకురాడు. ఎంతైనా నగరం నగరమే! పాపం! ఆడవాళ్ల మీది గౌరవం కొద్దీ ఈ మగవారు పిలవగానే వెళ్లుతున్నారు; ఆఁ! తెలిసింది, వీళ్లంతా సినిమాలో నటించే వాళ్లై వుంటారు. నాదెంత అదృష్టం! వీళ్లందరిని చూడగలిగాను' అని అనుకుంటూ ఇంకా రెట్టింపైన కుతూహలం కొద్దీ చూట్టం మొదలుపెట్టింది శ్రీనివాసరావు కొంప చేరేవరకు.

ఇంతవరకు తాను చూచిన విషయాలన్నీ శ్రీనివాసరావుతో చెబుతాననుకుంది, కానీ, మరుక్షణమే, 'ఇప్పుడేకాదు. పూర్తిగా చూచి నేను కొన్ని నేర్చుకుని నవనాగరికంగా కనిపిస్తూ చెబుతాను' అంటూ మహోవుల్లాసంగా ఆ రాత్రి గడిపింది.

తెల్లవారింది, మామూలు దినచర్యలో, ఏలోపం రానియ్యకుండా పనులు ముగించుకుంది. భర్త వెళ్లిన తరువాత, తలుపులు బిగించుకుని లూజ్‌గా జెడ అల్లుకుని పౌడరు కాస్త ఎక్కువగానే పూసుకుంది. పాన్ బీడా నమిలింది. పెదవులు పగడపు కాంతులను ఈనుతూ

వుంటే నున్నటి చెంపలు ప్రతిఫలించే అద్దాల్లా మెరిసిపోతున్నాయి. అంగసౌష్టవం, అమాయకత, అందం వున్న నవయౌవన ఏదో మునిగిపోయినట్లు ప్రక్క కిటికీ తెరిచింది. అది చాలదన్నట్లు ఆ కిటికీకి ఎదురుగా వున్న బాల్కనీలాంటి ప్రదేశానికి దారివున్న తలుపుగుండా వెళ్లి అమితోత్సాహంతో నిలుచుంది. ఆ ప్రదేశమంతా రద్దీగా ఉంది; వచ్చిపోయే జనం కిక్కిరిసి పోతున్నారు. ఈ జనం మధ్యలో వో నలభై ఏళ్లవాడు, సూటూ బూటూతో తలవంచుకుని ఈ ప్రాంతాన్ని తొందరగా దాటుతానన్న వేగంతో నడుస్తున్నాడు.

ఆవ్యక్తిని చూచిన చంద్రిక మనస్సులో వో వింత కోరిక పొటమరించింది.

ఇందాక ఆ స్త్రీలు పిలిచినట్లు ఈయనను నేను పిలిస్తే ఏమౌతుంది? ఆ రహస్యం ఏదో తెలుస్తుంది కదా! అంతగా అయితే 'నన్ను క్షమించండి, మీ హోదా తెలియక పిలిచాను, ఈ పట్టణానికి నేను కొత్త అంటాను' అంటూ తన మనస్సును సమాధానపరిచి, వెళ్లుతున్న వ్యక్తికి వినిపించేటట్లు విజిల్ వేసింది, ఆ ధ్వని తరంగాన్ని పరికించి తిరిగి చూచే వరకు వొంపులు తిరిగిన శరీరంతో, మంచి నిగనిగలతో, వనలక్ష్మిలా, శృంగార రసధునిలా వున్న చంద్రిక తనకు సంకేతంగా సైగ చేసింది. ఆ పిలుపుకు ఆగలేని ఆ అపరిచితుడు తన ఇందాకటి నడిని పక్కకు పెట్టి ఇంటివైపు నడిచి తలుపుపై కొట్టి ధ్వని చేశాడు.

ఆ శబ్దం విని తత్తరంతో చంద్రిక తలుపు తీసింది. తీసిన వెంటనే, తలుపును తోసుకుంటూ లోన ప్రవేశించిన ఆ వ్యక్తి మరో మాట లేకుండా బొమ్మలా ఎదుట నిలిచిన చంద్రికను ఆమాంతం రెండు చేతులా అలుముకుని నేరుగా పడకగది వైపు నడిచి పక్కమీద వేశాడు.

ఏం జరుగుతున్నదీ, ఏం జరుగబోయేది తెలియని పరిస్థితిలో చిక్కిన చంద్రిక ప్రమాదాన్ని పసిగడ్తూ భయంతో అవమానంతో వణికిపోతూ 'నాకు భర్త వున్నాడు. నాకు తెలియక ఆ చప్పుడు చేశాను. మీ కాళ్ల పట్టుకుంటాను. నన్ను తాకకండి, ఇదేదో పట్టణవాసపు నాగరికపు స్త్రీల ఆటగా నా భర్తకు చూపుతే మెచ్చుకుంటారని అనుకున్నాను' అంటూ అడగాలని నోట మాట రాక గిలగిలలాడుతుండగానే జరుగవలసిన పని జరిగిపోయింది.

తెలిసినా తెలియకపోయినా నిప్పు నిప్పే! ఆ నిప్పుతో చెలగాటం ఆడితే ముప్పు తేక ఏం చేస్తుంది.

చంద్రిక వెలకట్టరాని తన మర్యాదనూ మానాన్ని మంటగలుపుకుని కుప్పకూలింది.

ఆ అపరిచితుడు కూడా జరుగరానిది జరిగిందని గ్రహిస్తూ పశ్చాత్తాపపడ్డాడో ఏమో? మరో మాట మాట్లాడకుండా వో పచ్చనోటు తీసి చిన్న టేబుల్ పైపెట్టి వెళ్లిపోయాడు.

ఇంతలో మరో ఇల్లు కుదిరిన సంతోషంతో ఇంట్లో కాలుపెట్టిన శ్రీనివాసరావ్‌కు పచ్చనోటు కనిపించింది. 'చంద్రికా! ఈ డబ్బెందుకు ఇక్కడుంచావ్? ఈ రాత్రంతా మనం సామాను సర్దుకోవాలి, మనం రేపే ఇల్లు మారుతున్నాం' అంటూ ఆ పచ్చనోటు తీసి తన పర్సులో పెట్టుకున్నాడు.